క్లాప్ ఆటోలకు మంగళం

- నిన్న వలంటీర్లు – నేడు ఆటో డ్రైవర్ల తొలగింపు
- 'తమ్ముళ్ల' కోసం చెత్త సేకరణ ప్రైవేటుకు అప్పగింత
- 2014 నాటి చెత్త సేకరణ విధానాల అమలుకు చర్యలు
- మళ్లీ రోడ్డెక్కనున్న ప్రైవేటు చెత్త ట్రాక్టర్లు
- త్వరలో ఉత్తర్వులు జారీ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన క్లాప్ చెత్త తరలింపు వాహనాలు

కర్నూలు (టౌన్): ఎన్నికల ముందు.. వలంటీర్లను కొనసాగిస్తాం. వారికి రూ.5 వేలు కాదు. రూ.10 వేలు వేతనం ఇస్తాం. అని కూటమి ప్రభుత్వం చెప్పింది. అయితే ఆచరణలో రూ.5 వేలు కాదు కదా.. ఉన్నఫళంగా వారందరినీ తొలగించి రోడ్డున పడేసింది. ధర్నాలు, ఆందోళనలు చేసినా కనీసం పట్టించుకోలేదు. దీంతో వీరంతా రోడ్డున పడ్డారు.

➤ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్లాప్ (క్లీన్ ఏపీ) ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ఎత్తేయాలని నిర్ణయించింది. క్లాప్ ఆటోలకు మంగళం పాడనుంది. త్వరలోనే ఈ మేరకు ఆదేశాలు రానున్నట్లు నగరపాలక అధికారులు వెల్లడించారు. 2014లో అప్పటి ప్రభుత్వం చెత్త సేకరణను ప్రైవేటు పరం చేసింది. అదే విధానాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది.

పాత విధానం అమలుకు చర్యలు

2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన చెత్త సేకరణ విధానాలను మళ్లీ తెరపైకి తీసుకొస్తోంది. చెత్త సేకరణను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం దాదాపు ఖరారయ్యింది. త్వరలోనే దీనిపై ఉత్తర్వులు రానున్నాయి. దీంతో ప్రైవేటు ట్రాక్టర్లు రొడ్డెక్కనున్నాయి. ఈ ప్రైవేటు ట్రాక్టర్లను మొత్తంగా తెలుగు తమ్ముళ్లకు కేటాయించనున్నారు. ఇప్పటికే ఈ ప్రయత్నాలు ఊపందుకున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవహరించిన దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. చెత్త సేకరణను తెలుగు తమ్ముళ్లకు అప్పగించడం ద్వారా ప్రైవేటు ట్రాక్టర్లు రానున్నాయి. ఇక ప్రతిరోజు ఈ ట్రాక్టర్లలోనే ట్రిప్పుల పద్ధతిలో వారు చెత్తను సేకరిస్తారు. గతంలో ప్రతిరోజు నాలుగు ట్రిప్పులు తిప్పడం, కాలనీలలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం చేసేవారు. ఈ ట్రాక్టర్లు సక్రమంగా తిరుగుతున్నాయా.. లేదా.. అన్నది ఆ ఏరియా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ప్రతి ట్రిప్పును నమోదు చేస్తారు. ఈ విధానంలో బోగస్ ట్రిప్పులు నమోదు చేయడం నగరపాలక నిధులను కాజేయడం వంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. పెద్ద ఎత్తున్న విమర్శలు, అవినీతి ఆరోపణలు వచ్చాయి. అయినా మరోసారి అవే విధానాలు అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు ధ్రువీకరించాయి.



నగరంలో చెత్తను సేకరిస్తున్న క్లాప్ ఆటోలు



నగరపాలక సంస్థకు చెందిన చెత్త సేకరణ వాహనాల వివరాలు	
ఆటోలు	: 12
ట్రాక్టర్లు	: 17
టిప్పర్లు	: 7
బిగ్ కాంపాక్టర్లు	: 5
మినీ కంపాక్టర్లు	: 10
బిగ్ ట్రక్కు	: 1
క్లాప్ ఆటో టిప్పర్స్	: 91

కార్పొరేషన్‌లో క్లాప్ ఆటోల తొలగింపునకు చర్యలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెత్త సేకరణలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో క్లాప్ ఆటోలను వినియోగించింది. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేలా చర్యలు చేపట్టింది. ప్రైవేటు పరం కాకుండా ప్రభుత్వమే కర్నూలు కార్పొరేషన్‌లో ఇప్పటికే ఉన్న చెత్త వాహనాలతో పాటు అదనంగా 61 క్లాప్ ఆటోలను మంజూరు చేసింది. ఈ ఆటోలతో నగరంలోని 52 వార్డుల నుంచి ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించేవారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి క్లాప్ ఆటోలలో తరలించేవారు. తద్వారా చెత్త సేకరణ, పరిశుభ్రతలో 2023లో రాష్ట్రంలోనే కర్నూలు కార్పొరేషన్ రెండవ స్థానంలో నిలిచింది. అయితే 7 నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తర్వాత చెత్త సేకరణలో ప్రక్రియలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే క్లాప్ ఆటో కార్మికులకు 7 నెలలుగా బకాయిలు మంజూరు చేయడం లేదు. పైగా క్లాప్ ఆటోలను సైతం తొలగించే దిశగా చర్యలు చేపట్టింది. క్లాప్ ఆటోలను, కార్మికులను ఇంటికి పంపే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

కర్నూలు నగర జనాభా	6.50 లక్షలు
విస్తీర్ణం	116.25చదరపు కి.మీ.
శానిటేషన్ డివిజన్లు	17
52 వార్డుల నుంచి రోజుకు సేకరించే చెత్త	180మెట్రిక్ టన్నులు

కూలీలందరికీ ఉపాధి పనులు



పులకుర్తిలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: గ్రామాల్లో వలసల నివారణలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. శుక్రవారం మండలంలోని పులకుర్తి గ్రామంలో ఏపీఓ మోదీన్‌బాషా పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి పథకం కింద గ్రామాల్లో కావాల్సినంత మంది కూలీలకు పనులు కల్పించడం జరుగుతుందని ఏపీఓ తెలియజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 వరకు కూలి అందుతుందని, వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సూచించారు. అలాగే ఉపాధి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పనులు అవసరమైన కూలీల వివరాలను నమోదు చేసుకోవాలని ఏపీఓ ఆదేశించారు.

యువతి అదృశ్యం కేసును ఛేదించాలి

కర్నూలు న్యూసిటీ: కల్లూరు మండలం నాయకల్లుకు చెందిన భారతి కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మరో ముచ్చుమర్రి కేసుగా మార్చేందుకు చూస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు శేషఫణి, పట్నం రాజేశ్వరి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారతి అదృశ్యం కేసును త్వరగా ఛేదించి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టేందుకు పిలుపునిచ్చారు. ఘటన జరిగి 18 రోజులు అవుతున్నా బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే పరామర్శించకపోవడం దారుణమన్నారు.

క్లుప్తంగా

27న బహిరంగ వేలం పాట

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సంబంధించి ఈ నెల 27వ తేదీ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ రమానుజన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా తాత్కాలికంగా కళింగర పండ్లు, చెరుకు గడలు, ఐస్, కూల్‌డ్రింక్స్, సప్లయర్ సామగ్రి బాడుగకు విక్రయించుకునేందుకు ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఘనంగా ఉజ్జీవ మహాసభలు



పాస్టర్లను సన్మానిస్తున్న బూజునూరు సంఘ పెద్దలు

గడివేముల: మానవాళి మనుగడకు ఏసుప్రభు ప్రవచించిన శాంతి, సామరస్యాలే సోపానాలని ఈస్ట్ సెంట్రల్ ఇండియా యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ జాన్సన్ జాకోబ్ అన్నారు. శుక్రవారం బూజూనూరులో సెవెంత్ డే అడ్వాంటిస్ట్ మిషన్ ఆధ్వర్యంలో స్థానిక చర్చి ప్రాంగణంలో అంత్యకాల ఉజ్జీవ మహాసభలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లకు సన్మానం చేశారు. మొత్తం మూడు రోజుల పాటు కార్యక్రమం ఉంటుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దేవుడి ఆశీర్వాదం పొందాలని నిర్వాహకులు కోరారు. రాయలసీమ సెక్షన్ ప్రెసిడెంట్ పాస్టర్ శామ్యూల్‌పాల్, కార్యదర్శి బి.శామ్యూల్ నారాయణ, కోశాధికారి సునీల్ జార్జ్, సంఘ పెద్దలు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలపై అవగాహన

పాణ్యం: గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ కమలాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం పాణ్యం, గడివేముల మండలాల పశు వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు తదితర పశువుల ఆరోగ్యంపై తెలుసుకుంటారన్నారు. పాడిపశువులు జబ్బు పడితే అక్కడే చికిత్స అందిస్తారని చెప్పారు. అలాగే నట్టల నివారణ కార్యక్రమం, వ్యాధి నిరోధక టీకాలు, రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. పాడి పశువుల ఆర్యోగంపై ఎప్పటికప్పుడు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జార్తలు

పాణ్యం: మండల పరిధిలోని కౌలూరు గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న మౌలాలి, దస్తగిరి స్వామి వార్ల జార్తలు శుక్రవారంతో ముగిశాయి. తెల్లవారుజామున స్వామి వార్లకు ప్రత్యేక ఫతేహాలు నిర్వహించి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేక వాయిద్యాల నడుమ, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. ఊరేగింపు సందర్భంగా ప్రజలు స్వామివార్లకు చక్కెర చదివింపులు, కొబ్బరికాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను చావిడిలో కొలువుదీర్చారు.

భూముల రీసర్వే ప్రారంభం

కర్నూలు(రూరల్): గత వైఎస్సార్‌సీపీ సర్కారు శ్రీకారం చుట్టిన భూముల రీ సర్వేను ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభిస్తోంది. ఈ నెల 20వ తాదీఖున రీసర్వే పథకాన్ని మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో నిర్వహించనున్నట్టు మండల సర్వేయర్ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే కోసం ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్వోతో కూడిన ప్రత్యేక బృదం రోజుకు 20 ఎకరాల భూమిని సర్వే చేసి, అదేరోజు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారని వెల్లడించరు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: అభివృద్ధి పనులు, మరమ్మతుల నిమిత్తం నగరంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెంకటరమణ కాలనీ సెక్షన్, ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు క్యాంపు సెక్షన్ పరిధిలోని కాలనీలలో విద్యుత్ కోతలు ఉంటాయని వెల్లడించారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటమి ఎరుగని నేత జ్యోతిబసు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు తుదిశ్వాస వరకు ఏ ఎన్నికల్లోనూ ఓటమి లేకుండా విజయాలు సాధించారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జ్యోతిబసు 15వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిజానికి అసలైన నిర్వచనం జ్యోతిబసు అన్నారు. నేటి యువత ఆయన ఆడుగు జాడల్లో నడవాలని సూచించారు. నాయకులు ఆర్.నరసింహులు, సాయిబాబా పాల్గొన్నారు.

బుగ్గరామేశ్వరుని హుండీ ఆదాయం రూ.6.48 లక్షలు



హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ మద్దిలేటి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.6.48 లక్షలు లభించినట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గతేడాది మహాశివరాత్రి పర్వదినం కంటే ముందు రోజు నుంచి ఇప్పటి వరకు (10 నెలల కాలంలో) భక్తులు హుండీలో కానుకల రూపంలో సమర్పించిన నగదును లెక్కించగా రూ.6,48,815, అన్నదానం కోసం రూ.6 వేలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు బాలాజీ సేవా సమితి సభ్యులు, హుసేనాపురం బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, స్థానిక నాయకులు కాటిసేని నారాయణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు స్థల పరిశీలన



పాణ్యం ఎస్సార్బీసీ కాలనీ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ విష్ణు చరణ్

పాణ్యం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సొంత భవనం కోసం నంద్యాల జిల్లా జేసీ విష్ణుచరణ్ ఎస్సార్బీసీ కాలనీ పక్కనున్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. కళాశాలకు ఐదెకరాల స్థలం అవసరం కాగా ఖాళీ స్థలం ఐదెకరాల్లోపు ఉందని చెప్పారు. స్థలం వివరాలను తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థలం వివరాలు, మ్యాప్, పూర్తి బౌండరీలు, ప్రస్తుతం ఉన్న నిర్మాణాలు ఎక్కడెక్కడ ఉన్నాయి అనే విషయంపై ప్రతిపానదలు పంపాలని ఆదేశించారు. అనంతరం ఖాళీ స్థలంలోని సర్వే నంబర్‌తో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్‌తో పాటు, ఆర్ఐ రామ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి, సిబ్బంది ఉన్నారు.



మిలిటరీ కాలనీ సమీపంలో కేజీ రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ప్రమాదకరంగా గొయ్యి

కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారి (కేజీ రోడ్డు)పై ప్రేమగిరి మాత పుణ్యక్షేత్రం, మిలిటరీ కాలనీ సమీపంలో తారు రోడ్డు మార్జిన్‌ను అనుకుని ప్రమాదకరంగా పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఈ రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం బారిన పడాల్సిందే. ఎవరైనా మట్టి కోసం గొయ్యి తవ్వారో? లేదా ఎలా ఏర్పడిందో? తెలియదు గానీ గత 15 రోజులుగా గొయ్యి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని పూడ్చి వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– కర్నూలు(రూరల్)

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మాస్ మీడియా అధికారి

కర్నూలు(హాస్పిటల్): ఇంటి పరిసరాల్లో దోమలు పెరగకుండా శుభ్రంగా ఉంచుకోవాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులుశెట్టి చెప్పారు. శుక్రవారం స్థానిక గడ్డవీధి యూపీహెచ్‌సీ పరిధిలోని తెలుగుగేరిలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిసరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి, దోమల వల్ల వచ్చే వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు గురించి వివరించారు. పరిసరాల శుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఇంటి చుట్టూ, పరిసరాల్లో నీటి నిల్వలు ఏర్పడి అందులో దోమలు వృద్ధి చెందడం వల్ల వ్యాధులు సంభవిస్తాయన్నా రు. ప్రతిఒక్కరూ ఫ్రైడే – డ్రైడే పాటిస్తే దోమలను, వాటి గుడ్లను ప్యూపా దశలోనే నివారించవచ్చని చెప్పారు. అనంతరం ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ఏడిస్ లార్వాలను గుర్తించి వాటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యా బోధకురాలు పద్మావతి, నాగమ్మ, సునీత, తిరుపతమ్మ, ఖలీల్ పాల్గొన్నారు.

స్వచ్ఛత దివాస్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



సి.బెళగల్‌లో స్వచ్ఛత దివాస్ కార్యక్రమ నిర్వహణపై సూచనలు చేస్తున్న డీడీ శ్యామల

సి.బెళగల్: మండల సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్య శాఖ డీడీ శ్యామల సూచించారు. శుక్రవారం జిల్లా అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీడీఓ రాణెమ్మ ఇతర మండల అధికారులతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, హౌసింగ్, ఉపాధిహామీ, డీఆర్‌డీఏ అధికారులు, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో డీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రభుత్వ నిర్మాణ పథకాల లక్ష్యాలు, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలతో పాటు, ఉపాధి పనుల కల్పన, జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా మంచినీటి సరఫరా, డీఆర్‌డీఏ – వెలుగులో పొదుపు మహిళలకు రుణాలు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో నివేదికలను తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో గృహ నిర్మాణాలను లబ్ధిదారులతో పూర్తి చేయించాలని, ప్రజల ఇళ్ల వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల అధికారులను ఆదేశించారు. సమీక్షలో ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్, పీఆర్ ఏఈ వెంకటప్రకాష్, మండల ఉపాధిహామీ ఏపీఓ రామన్న, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, మల్లేశ్వరి, ఆయా గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి

మండలంలో ప్రతి నెలా మూడవ శనివారం చేపట్టే స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామితో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో స్వచ్ఛత దివాస్ కార్యక్రమ నిర్వహణ విధానాలపై చర్చించి, సూచనలు చేశారు. మొదటి రోజు శనివారం మండల కేంద్రంలో కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని డీడీ మండల అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతపై ర్యాలీ, మానవహారం, మంచినీటి ట్యాంక్‌లు, మురుగు కాలువల శుభ్రత తదితర కార్యక్రమాలను నిర్వహించి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీడీ సూచించారు. సమీక్షలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు సాహితీ స్రవంతి ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

కర్నూలు కల్చరల్: కామ్రేడ్ తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సందర్భంగా ఆయన నివాసాన్ని సాహితీ స్రవంతి ప్రాంతీయ కార్యాలయంగా శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, అవుల చక్రపాణియాదవ్ తెలిపారు. నగరంలోని కృష్ణానగర్‌లో ఈ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు తెలకపల్లి రవి పరిశోధనాత్మక సేకరణ 108 ఏళ్ల నాటని కర్నూలు నవల ×చతురికా ఆవిష్కరణ సభ జరుగుతుందని పేర్కొన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, టీవీజీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

కూటమి వైఖరి సిగ్గుచేటు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ కార్యక్రమాలను కూటమి నేతలు పార్టీ కార్యక్రమాలుగా మారుస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి, 30వ తేదీన రాష్ట్రస్థాయిలో దివ్యాంగుల పారా స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పోటీ లను అధికారికంగా నిర్వహిస్తున్నారని, అయితే పోటీలకు సంబంధించిన పోస్టర్లను కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పార్టీ కార్యాలయంలో విడు దల చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే సోమిశెట్టి దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

కల్లూరు: వొకేషనల్ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని జీసీడీఓ స్నేహలత అన్నారు. ఇంటర్ బ్యూటీ అండ్ వెల్నెస్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ శిక్షణ కార్యక్రమాలు సంక్రాంతి సెలవులలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కేజీబీవీ (మైనారిటీ) విద్యార్థినులు శిక్షణ పొందుతున్న కేంద్రాలను జీసీడీఓ, స్నేహలత, వొకేషనల్ విద్యా కో–ఆర్డినేటర్ విక్రమ్‌కుమార్ పరిశీలించారు. విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ వివరాలు అడిగి, వారికి తగిన సలహాలు సూచనలు అందించారు. ప్రిన్సిపాల్ ఉమాదేవి, ట్రైనర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

- 22న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు




మాట్లాడుతున్న పి.మురళీకృష్ణ

కర్నూలు(సెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 22న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు చేపట్టనున్నట్లు చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆ రోజు జిల్లా కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్ర ప్రారంభించి గడియారం ఆసుపత్రి, నెహ్రూ రోడ్, చౌక్ బజార్ మీదుగా పాత బస్టాండ్ వరకు కొనసాగుతుందన్నారు. అక్కడ పార్టీ మీటింగ్ ఉంటుందని చెప్పారు. మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు పాల్గొన్నారు.

కొత్తకోట గ్రామం వద్ద విద్యుత్ స్తంభానికి ఎగబాకిన తీగ మొక్కలు



రేమట దారిలో జాయింట్ స్తంభాల మధ్య ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



పొంచి ఉన్న ప్రమాదం

పచ్చదనం మాటున విద్యుత్ ప్రమాదం పొంచి ఉంది. సి.బెళగల్ మండలంలోని కొత్తకోట గ్రామ శివారులలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారంగా మారియి. కొత్తకోట గ్రామం నుంచి రేమట గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభానికి సైతం తీగజాతి మొక్క ఏపుగా పెరిగి విద్యుత్ తీగలను అల్లుకున్నాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను, తీగ మొక్కలను తొలగించి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

– సి.బెళగల్



పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు పాకుతున్న తీగ మొక్క